
యూనిట్ I

# 2. మన సంస్కృతి

-డా॥ బిరుదురాజు రామరాజు

## ఆలోచించండి - చెప్పండి




### ప్రశ్నలు

1. మొదటి చిత్రానికి రెండవ చిత్రానికి మధ్యగల తేడా ఏమిటి ?
2. మొదటి చిత్రంలోని మనుషుల వేషధారణ ఎలా ఉంది?
3. రెండవ చిత్రంలోని మనుషుల వేషధారణ ఎలా ఉంది ?
4. అప్పటి ఇండ్లు పరిసరాలకు, ఇప్పటి ఇండ్లు పరిసరాలకు మధ్య గల తేడాలు ఏవి ?

### ఉద్దేశం


18, 20 శతాబ్దాల మధ్య కాలంలో హైదరాబాదు సంస్థానంలో విలసిల్లిన సంస్కృతిని తెలపడమే ఈ పాఠం ఉద్దేశం.

**ఈ పాఠం బిరుదురాజు రామరాజు రాసిన 'రామరాజీయం' అనే వ్యాస సంకలనంలోనిది.**

### విద్యార్థులకు సూచనలు

1. పాఠం చదవండి. పదపట్టిక చూసి పదాలకు అర్థాలు తెలుసుకోండి.
2. సందర్భానికి తగిన అర్థాలు గ్రహించి చిత్రాల ఆధారంగా పాఠం భావాన్ని గ్రహించండి.
3. అర్థంగాని విషయాల గురించి మొదట జట్టులో చర్చించండి. తర్వాత ఉపాధ్యాయుడితో చర్చించి అవగాహన పెంచుకోండి.

© SCERT not to be republished



ఒక జాతి కాని, ఒక దేశం కాని తనదైన వైలక్ష్యంతో భౌతికంగాను, మానసికంగాను దైనందిన జీవితంలోను, శాశ్వత జీవితంలోనూ సాధించిన ప్రగతిని, సంభవించే మూల్యాలను నాగరికత అనీ, సంస్కృతి అనీ పండితులు అంటున్నారు. ఈ దేశ సంస్కృతిలో భౌతిక మానసికములతో పాటు ఆధ్యాత్మికంగా సాధించిన ప్రగతిని కూడా చేర్చుకోవలసి ఉంటుంది. కట్టు, బొట్టు, జుట్టు, ఆహార, విహారాలు, గృహోపకరణాలు, పనిముట్లు, సంఘ వ్యవస్థ, వృత్తులు వాటికి సంబంధించిన సంస్కృతిలో ఆ జాతి విశ్వాసాలు, అభిరుచులు, ఆచార వ్యవహారాలు, నీతి నియమాలు లలితకళలు వంటివి అంత తొందరగా మారవు.

ఏ సమాజంలోనైనా ఆర్థిక స్తోమత, చైతన్యము అనే రెండు విషయాలపై ఆ సమాజ సంస్కృతి సంకోచవ్యాకోచాలు ఆధారపడి ఉంటాయి. అవి ఆ సమాజాన్ని పాలించే వ్యవస్థ మీద నిర్భరమై ఉంటాయి. క్రీ.శ. 1948 దాకా తెలంగాణం 500 ఏండ్లు నిరంకుశ రాజుల పాలనలో ఉండినది. ఆ రాజులు కూడా విదేశీయులు, విధర్మీయులు. అప్పటి తెలుగు సమాజాన్ని నాగరికులు, జానపదులు, అక్షరాస్యులు, నిరక్షరాస్యులు, అగ్రవర్ణాలు, నిమ్నవర్గాలు, సంచార జాతులు, ఆటవికులుగా విభజించవచ్చు. పాలితులు పాలకులను అనుకరించటం సహజం. కనుక ఆనాటి నాగరికులు పైజామాలు, షేర్వానీలు, కుచ్చు టోపీలు ధరించడం గొప్పగా భావించేవారు. ఇది ఇంటి బయటి వేషం. ఇంట్లో ధోవతులు, కుడ్తాలు, కండువాలు, లేదా చిన్న పంచెలు ధరించేవారు. పాలకులతో ఉద్యోగులతో సంబంధం లేని వారికి ఇంటా బయటా ధోవతులు, బొందెలంగీలు, రుమాళ్ళు ఉండేవి. జానపదులకు కులాన్ని బట్టి వేషం ఉండేది.


స్త్రీల వస్త్రధారణ కూడా కులోచితంగా ఉండేది. బ్రాహ్మణ స్త్రీ గోచీ కట్టుకు, విశ్వబ్రాహ్మణ స్త్రీల గోచీ కట్టుకు తేడా ఉండేది. రెడ్లు, వెలమలు, కోమట్లు గోచీలేని చీర కట్టుకునేవారు. మిగతా వృత్తుల వారు, పనిపాటల వారు మోకాళ్ళు కనపడకుండా చీరని మడచి గోచీ పెట్టుకునేవారు. గొల్లలకు, కాపుల్లో ఒకటి రెండు తెగలకు కుడిపైటలు, మిగతావారికి ఎడమ పైటలు. రవికెలు నానా రకాలు; అన్నీ మోచేతుల వరకుండేవే. చిన్న పిల్లలకు లంగాలు, పెద్ద పిల్లలకు ఒల్లెలు. కేశాలంకరణం నానా విధాలు.

© SCERT not to be republished

స్త్రీలు, పురుషులు ఆర్థిక స్తోమతను బట్టి వెండి, బంగారు నగలు ధరించేవారు. వివాహిత స్త్రీలకందరికీ గంటెపుస్తెలు, మట్టెలు తప్పని సరి. తెలంగాణాంధ్రుల మాంగల్యాలు మహారాష్ట్రుల మాంగల్యాల వలె చిన్నవి. మట్టెలు వెండివైనా కంచువైనా కావచ్చు. తీగ చుట్టలని, బోలు మట్టెలని, గట్టి మట్టెలని వీనిలో భేదాలు.




అందం, ఆరోగ్యాలకోసం స్త్రీలు ముఖాలకు పసుపు, తలకు జీడిగింజలు. కచూరాలు, బావాంచాలు, కర్పూరం వేసి కాచిన నువ్వుల నూనె లేదా కొబ్బరి నూనె రాసుకొనేవారు. స్నానసమయాన ఒంటికి గట్టి పిండి, తలకు తలమసాలా రాసుకొనేవారు. సబ్బులు, స్నో , పౌడర్లు 20వ శతాబ్దం రెండో పాదంలో పల్లెసీమలకు వచ్చినవి.



గ్రామాలన్నీ దాదాపు స్వయంసమృద్ధంగా ఉండేవి. వ్యవసాయం చేసేవారు. భూమిపై ఆధారపడేవారి సంఖ్య అధికం. తరువాత చేనేత పరిశ్రమ. రాట్నాలు వడికేవారు. పొట్టకై, బట్టలకై ఇతర ప్రాంతాల మీద తక్కువ ఆధార పడేవారు. ఉప్పు, కిరసనాయలు, బాగాలు, లవంగాలు, సుగంధ ద్రవ్యాలు. జీడిపప్పు, పంచదార, బెల్లం, సన్నబట్టలు, పట్టుబట్టలు మాత్రం పేటలకు, జిల్లా తాలుకా కేంద్రాలకు పోయి తెచ్చుకునేవారు. వస్తురూపంగానే వినిమయం ఎక్కువ సాగేది. వరి పండే చోట్ల వరిఅన్నము; ఎక్కువగా మొక్క జొన్న, పచ్చజొన్న, తెల్లజొన్న, సజ్జలు, రాగులు, తైదలు ప్రధాన ఆహారధాన్యాలు. నువ్వులు, ఆముదాలు, పత్తి, శనగ, కంది, పెసర, మినుములు, బొబ్బెర్లు, అనుములు తగుమాత్రం పండేవి.



పెండ్లిళ్ళు, పండుగలప్పుడు నిలువ చేసుకొనే ఖాద్యాలు, లడ్లు, అరిసెలు, కరిజలు, చక్కిలాలు, మడుగుబూరెలు, చేగోడీలు, కారపు బిళ్ళలు, నువ్వులుండలు, పెసరుండలు – ఆనాటి కానాడు చేసేవి; కాజేసేవి. అట్లు, తప్పేల చెక్క లేదా సర్వపిండి, ఉప్పుడు పిండి, పెసరు, మినప బొబ్బెర పణ్యారాలు, మొక్క జొన్న గారెలు, బొబ్బట్లు, మండెగలు, జొన్న సజ్జ ఊచ బియ్యం. ఆర్తవములు, అటుకులు, బొంగు పేలాలు, పేలాల పుట్నాలు, బెల్లపుండలు, కారపు



© SCERT not to be republished

శనగలు, గుడాలు (శొండెలు), కొబ్బరి బెల్లం చిరుతిండ్లు. పూరీలు, సేమ్యా పాయసం, భక్ష్యాలు, ఆయా ఋతువుల్లో కాచే మామిడి, జామ, దబ్బపండ్లు, ఉసిళ్ళు, పేదలకు కూడా పిడికెడు వడ్లకో, జొన్నలకో లభించేవి. ఈతపండ్లు, తాటిపండ్లు, ముంజలు, గేగులు, తమిడి పండ్లు, రేగుపండ్లు , సీతాఫలాలు, నేరేడు పండ్లు ప్రకృతిమాత ఫలాపేక్ష రహితంగా ప్రసాదించే ఫలాలు. ద్రాక్ష, అరటి, మోసంబి, సంత్రావంటి ఫలాలు, టీ కాఫీ వంటి పానీయాలు నాకు బుద్ధి వచ్చిన తర్వాతనే పల్లెటూళ్లకు వచ్చినవి.

పల్లెటూళ్ళ గృహోపకరణాలు సామాన్యమైనవి. వంటలకు వార్పులకు 95 శాతం జనులు మట్టిపాత్రలే వాడేవారు. కొందరు కళాయిపోయించిన ఇత్తడి పాత్రలు, రాతివెండి పాత్రలుపయోగించేవారు. సంపన్నుల యిండ్లలో వెండి చెంబులు, కంచాలు, గిలాసలు ఉండేవి. ఛప్పర్ పలంగులు, తూగుటూయ్యేలలు, పట్టె మంచాలు, నులక మంచాలు, కుక్కి మంచాలు, గడమంచాలు, తాటిచాపలు, ఈతచాపలు, గడిచాపలు, పరుపులు, జంపుఖానాలు, తివాసీలు, ఛద్దర్లు, దుప్పట్లు, కంబళ్ళు శయ్యాసామగ్రి. ఇంట్లో కూర్చుండడానికి పీటలు, భోజనాలకు ఒరుగుడు పీటలు, కంచం పీటలు, ముక్కాలిపీటలు, కుర్చీలు, ఆరాంకుర్చీలు, కట్టెకుర్చీలు, తట్టుకుర్చీలు, బెత్తంకుర్చీలుండేవి.

ఇక పెండ్లిళ్ళ విషయం వస్తే, మూడుదినాల పెండ్లి, ఐదుదినాల పెండ్లి జరిగేవి. ఒక యింట పెండ్లి జరిగితే వాడవాళ్ళు, బంధువులు, పనిపాటల్లో, పాలుపంచుకొనేవారు. సన్నాయిమేళం, డప్పులు, తాషామర్పా సామాన్య వాద్యాలు; బాండుగన్ సెట్, నగారా, షహ్నాయి, ఎదుర్కోళ్లకు ఊరేగింపునకు పెట్రోమాక్స్ లైట్లు పెట్టటం చాలా గొప్ప. లాంఛనాల పట్టింపే గాని వరకట్నాలు లేవు.

తెలంగాణంలో బడిలేని ఊరైనా ఉండేది కాని గుడి లేని ఊరు లేదు. దాదాపు 650 దేవాలయాలలో నిత్యారాధన జరిగేది. ఇవి కాక ప్రతి గ్రామంలో ఇద్దరు ముగ్గురు గ్రామదేవతలున్నారు. ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ, గంగమ్మ, ముత్యాలమ్మ, దుర్గమ్మ, బాలమ్మ, పోలేరమ్మ, మారెమ్మ, అక్కలమ్మ, ఈదమ్మ, పెద్దమ్మ, చౌడమ్మ, ఉప్పలమ్మ, మహాలక్ష్మమ్మ, పోతురాజు, భైరవుడు వంటి దేవతలు నూర్ల కొలది ఉన్నారు. వీరిలో కొందరు పొలిమేర దేవతలు, కొందరు ఋతువుల దేవతలు, కొందరు గ్రామదేవతలు, కొందరు గృహదేవతలు, కొందరు ఆరోగ్య దేవతలు, కొందరు పొరుగూరి దేవతలు. వీరి ఆరాధనలు, కొల్పులు, బోనాలు కొన్ని చోట్ల ఆయా గ్రామాలకు పరిమితం. మరి కొన్ని చోట్లకు ప్రక్కగ్రామాలవారు, దూరప్రదేశాలవాళ్ళు వస్తారు. ఆటవికులు మేడారం సమ్మక్క జాతరలో, కీసలాపురం భీమదేవుని జాతరలో గ్రామీణులు, నాగరకులు లక్షల సంఖ్యలో పాల్గొంటారు. నాలుగైదు తురకలిండ్లుండే పల్లెల్లో కూడా మొహర్రం పండుగలో హిందువులు సమధికోత్సాహంతో పాల్గొనేవారు. పీరీలు ఎత్తు కోవటం, దట్టీలు కట్టటం, మలీదా చేయటం, నిప్పుగుండాలు తొక్కటం, పులివేషాలు వేయటం ఎక్కువగా హిందువుల వంతే. పల్లెటూరి ముస్లింలు పోచమ్మగుడికి, నరసింహస్వామి ఆలయాలకు, రామాలయాలకు అక్కడక్కడ పోవటం ఆచారం.

హైదరాబాదు నగరం వెలుపల జహంగీరు పీరీల దర్గా, ఉర్సు, కాజీపేట దర్గా, హన్మకొండ రెడ్డి నవాబు దర్గా, ఇంకా కరీంనగరం, మెదకు, నిజామాబాదు జిల్లాల్లోని అనేక దర్గాలకు పోయి మ్రొక్కులు చెల్లించేవారు. ముసల్మానుల కంటే హిందువులే ఎక్కువ. ఈ విధమైన దైవారాధన భావం మూలంగా పండితుల్లోను పామరుల్లోనూ పరస్పర ప్రేమలు సహకారం, సద్భావనలు ఉండేవి. దేవాలయాలు ధార్మిక నిష్ఠకే కాక లలిత కళా వికాసానికి తోడ్పడ్డాయి. చిత్రకళ, నాట్యం, సంగీతం, భక్తి, సాహిత్యం ఆ దినాలలో దేవాలయాలు కేంద్రంగానే వికసించి వ్యాపించినవి.



© SCERT not to be republished

## కవి పరిచయం



బిరుదురాజురామరాజు

తెలుగు జానపద సాహిత్యమనగానే మనకు గుర్తుకు వచ్చేవారు బిరుదురాజురామరాజుగారు. వీరు 16 ఏప్రిల్ 1925 సంవత్సరంలో వరంగల్ జిల్లాలోని దేవునూరు గ్రామంలో జన్మించారు. పెరిగింది మడికొండలో.

కవి, పరిశోధకులు, పరిష్కర్త, అనువాద రచయిత, సంపాదకులుగా ప్రసిద్ధులు, ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులుగా, డీన్‌గా, వరంగల్లు పి.జి. సెంటర్ ప్రధానాచార్యులుగా సేవలందించారు.

శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యమును సేకరించి, పరిష్కరించారు. 'తెలుగు జానపద గేయ సాహిత్యం' వీరి పరిశోధన గ్రంథం. చరిత్ర కెక్కని చరితార్థులు, ఆంధ్రయోగులు, మరుగునపడిన మాణిక్యాలు, ఉర్దూ, తెలుగు నిఘంటువులు, శ్రీ సత్యసాయి విన్నపాలు, తెలుగువీరుడు, వీర గాథలు, అల్లూరి సీతారామరాజు, తెలుగు జానపద రామాయణం, తెలుగు సాహిత్యోద్యమ కారులు, తెలంగాణ పల్లె పాటలు, తెలంగాణ పిల్లల పాటలు వీరి రచనలు. 8 ఫిబ్రవరి, 2010 నాడు వీరు స్వర్గస్థులైనారు.

### ప్రక్రియ - వ్యాసం

ఏదైనా ఒక అంశాన్ని గురించి సంగ్రహంగా, ఆకట్టుకొనేలా వివరించేది వ్యాసం. సూటిగా, స్పష్టంగా, నిర్దిష్టంగా, సులభగ్రాహ్యంగా ఉండటం దీని ప్రత్యేకత.

© SCERT not to be republished

## ఇవి చేయండి

### I. వినడం - మాట్లాడడం

1. గ్రామాలన్నీ గతంలో సమృద్ధిగా ఉండేవని అంటారు. సమృద్ధి అంటే ఏమిటి? మీ గ్రామ సమృద్ధి గురించి తెల్పండి.
2. కింది విషయాలను సమర్థిస్తూ లేదా విభేదిస్తూ మాట్లాడండి.
   (అ) గతంలోనే మన సంస్కృతి గొప్పగా ఉండేది.
   (ఆ) నాగరికత పేరుతో మన ఆచారవ్యవహారాల్లో, వేషభాషల్లో, కట్టుబాట్లలో మార్పులు వస్తున్నాయి.
3. నాటినుండి నేటివరకు ఇండ్ల నిర్మాణంలో వచ్చిన మార్పులు ఏమిటో చెప్పండి.

### II. చదవడం, అవగాహన చేసుకోవడం

**1. కింది పేరాను చదవండి. ఇచ్చిన ప్రశ్నలకు ఒక వాక్యంలో జవాబులు రాయండి.**

వన్యమృగాలలోని చాలా జాతులు రోజురోజుకూ అంతమైపోతున్నాయి. వీటి సంరక్షణకోసం ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతున్నాయి. వేటను నిషేధించాయి. వన్యసంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాయి. పట్టణీకరణ పెరుగుతున్న కొద్దీ అటవీప్రాంతం కుదించుకొని పోతుంది. పరిశ్రమల నిర్మాణం కోసం కూడా అటవీ ప్రాంతాన్నే వాడుకుంటున్నారు. అప్పటి వరకూ ఆ ప్రాంతంలో తలదాచుకుంటున్న వన్య ప్రాణులు వేరే చోటుకి వలస పోతున్నాయి. లేదా చనిపోతున్నాయి. అడవుల గుండా రోడ్లు నిర్మించడం అటవీ సంపదను దోచుకునే వారికి వరంగా మారింది. ఏనుగుల దంతాలు, ఖడ్గమృగాల కొమ్ములు,

జింకల, పులుల చర్మాలను అక్రమంగా తరలించడంకోసం వాళ్ళు ఈ దారులను వాడుకుంటున్నారు. ఇలాంటి చర్యలను అరికట్టి వన్యప్రాణులను కాపాడాల్సిన బాధ్యత మానవులందరి మీద ఉంది.

(అ) వన్యమృగాల పరిరక్షణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టింది?

(ఆ) అటవీ ప్రాంతం ఎందువల్ల కుదించుకపోతోంది ?

(ఇ) అడవులు కుదించుకపోవటంవల్ల వన్యమృగాల పరిస్థితి ఏమౌతున్నది?

(ఈ) అడవుల నుండి వేటిని అక్రమంగా తరలిస్తున్నారు?

(ఉ) అడవుల్లో రోడ్డు వేయటంవల్ల వన్యమృగాలకు కలిగే నష్టమేమి?

**2. పాఠం ఆధారంగా కింది పట్టికను పూరించండి.**

| నాటికాలంలో వేసుకొనే దుస్తులు | ఆహారపదార్థాలు | పండుగలు/జాతరలు | జీవనాధారం | అలంకరణ |
|---|---|---|---|---|
| | | | | |

**3. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

(అ) సంస్కృతి అంటే ఏమిటి?

(ఆ) గ్రామాల్లో వ్యాపార, వాణిజ్యాలు ఏ రూపంలో జరిగేవి? ఎందుకు?

(ఇ) గ్రామాల్లో పీర్ల పండుగ ఎలా జరుపుకొనేవారు ?

(ఈ) నాటికాలంలో వివాహాలు ఎలా జరిగేవి ?

(ఉ) దేవాలయాలు వేటికి కేంద్రాలుగా విలసిల్లాయి ?

## III. స్వీయ రచన

**1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

(అ) గతంలో పెండ్లి ఐదురోజులు చేసేవారు కదా! ఇప్పుడు ఒక్కరోజులో పూర్తి చేస్తున్నారు. అలా ఎందుకు చేయాల్సి వస్తున్నదో రాయండి.

(ఆ) ప్రస్తుతం ప్రజలు గ్రామాలనుండి పట్టణాల వైపు వలసలు పోతున్నారు. కారణాలు ఏమిటో ఊహించి రాయండి.

(ఇ) దేవాలయాలు ధార్మికనిష్ఠకే గాక లలితకళా వికాసానికి తోడ్పడ్డాయని పాఠంలో చదివారు కదా! దీన్ని మీరెలా సమర్థిస్తారు?

(ఈ) మన సంస్కృతి కాపాడుకోవడానికి మీరేం చేస్తారు?

**2. కింది ప్రశ్నలకు పది వాక్యాల్లో జవాబులు రాయండి.**

(అ) పాఠం సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.

(ఆ) మన సంస్కృతి గొప్పతనాన్ని చెప్పే అంశాల్ని విశ్లేషిస్తూ అభిప్రాయం రాయండి.

(ఇ) ఈ పాఠంపై మీ అభిప్రాయాన్ని సొంతమాటల్లో రాయండి.

© SCERT not to be republished

## IV. పదజాలం

**1. కింది వాక్యాలు చదివి సమాన అర్థం వచ్చే పదాల కింద గీత గీయండి.**

(అ) చంద్రుడు చల్లదనాన్నిస్తాడు. సోముడు కలువలను వికసింపజేస్తాడు. ఇందుడు పౌర్ణమినాడు నిండుగా ఉంటాడు. శశిని అందరూ మామ అని పిలుస్తారు.

(ఆ) పూర్వం పెండ్లి ఐదురోజులు జరిగేది. కాని ఇప్పుడు వివాహం ఒక్క రోజులో చేస్తున్నారు. కాలక్రమంలో కళ్యాణం చేసే విధానం మారింది.

(ఇ) గుడిలో పూజలు నిత్యం జరుగుతాయి. రోజూ కోవెలకు వెళ్ళటం నాకు ఇష్టం. దేవాలయాలు ప్రశాంతతను ఇస్తాయి. పూర్వం దైవ మందిరాలు విద్యాలయాలుగా వెలుగొందాయి.

**2. కింది పదాల్లో భిన్నంగా ఉన్న పదాన్ని గీత గీసి గుర్తించండి.**

(అ) కట్టు, గిట్టు, బొట్టు, జుట్టు

(ఆ) అక్షరాస్యులు, నిరక్షరాస్యులు, విద్వాంసులు, జ్ఞానులు

(ఇ) నులకమంచం, తాటిచాప, మడతమంచం, పట్టెమంచం

(ఈ) పాలు, పెరుగు, నీరు, వెన్న

**3. కింది వాక్యాలలో ప్రకృతి, వికృతి పదాలు ఉన్నాయి. పరిశీలించి ప్రకృతి పదాలకు ఎదురుగా వికృతి పదాలు రాయండి**

(అ) మాతృభాషపై పట్టున్నవారు ఏ బాసనైనా సులభంగా నేర్చుకోగలరు.

(ఆ) అందం, ఆరోగ్యం కోసం గతంలో స్త్రీలు ముఖాలకు పసుపు రాసుకొంటే, నేడు మొగాలకు స్నోలు, పౌడర్లు రాసుకొంటున్నారు.

(ఇ) ఒకప్పుడు కులాన్ని బట్టి వృత్తులుండేవి. నేడు ఏ కొలమువారైనా ఏ వృత్తినైనా స్వీకరిస్తున్నారు.

(ఈ) కొందరు నాటకాలలో వేసాలు వేసి పొట్ట పోసుకొనేవారు. వారి వేషధారణ పాత్రనుబట్టి ఉంటుంది.

## V. సృజనాత్మకత

పూర్వం మన ఇండ్లల్లో జరిగే పెండ్లిళ్ళు, పండుగల సందర్భాల్లో అనేక రకాల పిండివంటలు చేసేవారు. అవి చాలా రుచికరంగా, నోరూరించేవిగా ఉండేవి. ఈ పాఠంలో లడ్లు, చక్కిలాలు, చేగోడీలు ఇలా చాలా పిండి వంటలు ఇచ్చారు. వాటిని తీసుకొని ఒక గేయకవితను రాయండి.

(లేదా)

ఈ పాఠంలో ప్రజలు వస్త్రాలు ధరించటంలో చూపిన భిన్నత్వం, ఇండ్లనిర్మాణం, ఇండ్లల్లో ఉపయోగించే వస్తువులు, పండించే పంటలు, పండుగల సందర్భంలో చేసే పిండివంటలు, మన సంస్కృతి విశిష్టతను తెలుపుతూ మీ మిత్రునికి లేఖ రాయండి.

© SCERT not to be republished

## VI. ప్రశంస

పాఠం ఆధారంగా మన సంస్కృతిలో ప్రశంసించదగిన విషయాలు ఏవి? వాటి గురించి మీ మిత్రులతో చర్చించండి. ఎందుకు ప్రశంసించ దగినవో వివరిస్తూ చిన్న వ్యాసం రాయండి.

## VII. భాషను గురించి తెలుసుకుందాం

### 1. సమాపక, అసమాపక క్రియలు

(అ) కింది క్రియాపదాలను చదవండి.

తిని, చూసి, వండి, విని చూస్తే, చేస్తూ, వింటే, ఆడుతూ

పై క్రియలలో పని పూర్తికాలేదని తెలుస్తుంది. ఇలా పని పూర్తికాని క్రియలను అసమాపక క్రియలని అంటారు. అట్లే **తిన్నాడు, చదివాడు, చూశాడు, వండింది, విన్నది, చేస్తాడు.** మొదలగు క్రియా పదాల వల్ల పని పూర్తి అయినట్లు తెలుస్తుంది. ఇలా పని పూర్తి అయిన క్రియలను సమాపక క్రియలు అంటారు.

(ఆ) కింది వాక్యాలు చదవండి. సమాపక, అసమాపక క్రియా పదాల కింద గీత గీయండి.

- రాజు అన్నం తిని, గుడికి వెళ్ళాడు.
- గీత వంట చేసి, అందరికి వడ్డించి, తాను తిని నిద్రపోయింది.
- రజని నిద్ర లేచి, స్నానంచేసి, పూజచేసి, అన్నంతిని బడికి వచ్చింది.

### 2. సామాన్య వాక్యాలు

(అ) రాజు అన్నం తిన్నాడు.

(ఆ) గోపి పరీక్ష రాశాడు.

(ఇ) గీత బడికి వెళ్ళింది.

పై వాక్యాలు గమనించండి. ఆ వాక్యాల్లోని తిన్నాడు, రాశాడు, వెళ్ళింది అనే క్రియలు సమాపక క్రియలు. ప్రతి వాక్యంలో ఒకే ఒక సమాపక క్రియ ఉంది. ఇలా ఒకే ఒక సమాపక క్రియ ఉంటే ఆ వాక్యాలను సామాన్య వాక్యాలు అని అంటారు. కొన్ని సామాన్య వాక్యాలు క్రియ లేకుండా కూడా ఉంటాయి.

ఉదా : హైదరాబాదు మన రాష్ట్ర రాజధాని.

### 3. సంశ్లిష్ట వాక్యాలు

**గీత బజారుకు వెళ్ళింది. గీత కూరగాయలు కొన్నది.**

పై వాక్యంలో గీత నామవాచకం. గీత మొదటి వాక్యంలో ఉన్నందువల్ల రెండో వాక్యంలో పునరుక్తమైన నామవాచకం తొలగించి, మొదటి వాక్యంలోని క్రియ 'వెళ్ళింది'ని 'వెళ్ళి' అనే అసమాపక క్రియగా మార్చి రాస్తే **సంశ్లిష్టవాక్యం** ఏర్పడుతుంది.

**గీత బజారుకు వెళ్ళి, కూరగాయలు కొన్నది.**



© SCERT not to be republished

కింది సామాన్య వాక్యాల్ని, సంశ్లిష్ట వాక్యాలుగా మార్చి రాయండి.

(అ) విమల వంట చేస్తుంది. విమల పాటలు వింటుంది.

(ఆ) అమ్మ నిద్ర లేచింది. అమ్మ ముఖం కడుక్కుంది.

(ఇ) రవి ఊరికి వెళ్ళాడు. రవి మామిడి పండ్లు తెచ్చాడు.

కింది సంశ్లిష్ట వాక్యాల్ని, సామాన్య వాక్యాలుగా మార్చి రాయండి.

(అ) తాత భారతం చదివి, నిద్ర పోయాడు.

(ఆ) చెట్లు పూతపూస్తే, కాయలు కాస్తాయి.

(ఇ) రాము నడుచుకుంటూ వెళ్ళి, తన ఊరు చేరాడు.

4. సంధులు: కింది ఖాళీలను పూరించండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఉదా : అభ్యుత్థానం | = | అభి | + | ఉత్థానం | - యణాదేశసంధి |
| దైవారాధన | = | దైవ | + | ఆరాధన | ------ |
| పరమాత్మ | = | ------ | + | ------ | సవర్ణదీర్ఘ సంధి |
| ------ | = | కుల | + | ఉచితం | గుణ సంధి |
| కనపడకుండ | = | కనపడక | + | ఉండ | ------ |
| కేశాలంకరణ | = | ------ | + | ------ | సవర్ణదీర్ఘ సంధి |
| ------ | = | గ్రామీణులు | + | అందరికి | ఉత్వ సంధి |
| బ్రాహ్మణేతరులు | = | బ్రాహ్మణ | + | ఇతరులు | ------ |
| గృహోపకరణ | = | ------ | + | ------ | గుణ సంధి |
| ------ | = | నాలుగు | + | ఐదు | ఉత్వ సంధి |

© SCERT not to be republished

## 5. సమాసాలు

### (అ) కింది వానికి విగ్రహ వాక్యాలు రాసి సమాసాలను గుర్తించండి.

| | | | |
|---|---|---|---|
| ఉదా : వేషభాషలు | = | వేషము, భాష | ద్వంద్వ సమాసం |
| ఎనిమిది మూరలు | = | ...................... | ............................ |
| దశదిశలు | = | ...................... | ............................ |
| పంచకావ్యాలు | = | ...................... | ............................ |
| చతుర్వేదాలు | = | ...................... | ............................ |
| కూరగాయలు | = | ...................... | ............................ |
| అక్కా సెల్లెళ్లు | = | ...................... | ............................ |

**ప్రాజెక్టు పని**

గతంలో పెండ్లిళ్ళు, ఎలా జరిగేవో పాఠం ద్వారా తెలుసుకొన్నారు కదా! ప్రస్తుతం పెండ్లిళ్లు ఎలా జరుగుతున్నాయో తెలుసుకొని రాయండి.

© SCERT not to be republished

**నేనివి చేయగలనా ?**

| | | |
|---|---|---|
| 1. | ఈ పాఠ్యాంశాన్ని సమర్థిస్తూ మాట్లాడగలను. | ఔను / కాదు |
| 2. | పాఠం చదివి సమాచారాన్ని పట్టిక రూపంలో రాయగలను. | ఔను / కాదు |
| 3. | మన సంస్కృతిలోని గొప్పతనాన్ని సొంత మాటల్లో చెప్పగలను. అవగాహనతో విశ్లేషించగలను. | ఔను / కాదు |
| 4. | గేయ కథను లేదా సంస్కృతి విశిష్టతల గురించి లేఖ రాయగలను. | ఔను / కాదు |

**నడకలో తప్పటడుగులు వేయవచ్చుగానీ, నడతలో తప్పటడుగులు వేయకూడదు.**